సాయిబాబానగర్ సమస్యలు

పరిష్కరించాలని డీసీకి వినతి



అల్వాల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సాయిబాబానగర్ కాలనీ ప్రతినిధులు

అల్వాల్: అల్వాల్‌లోని సాయిబాబానగర్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ, 40 ఫీట్ల రోడ్డును 20 ఫీట్లకు కుదించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ముందు తరాల వారికి ఇబ్బంది లేకుండా కాలనీ లేఅవుట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సాయిబాబానగర్ కాలనీలో ఉన్న స్కేటింగ్ గ్రౌండ్ పేరు మంగాపురం ప్లే గ్రౌండ్ అని ఉందని, దాన్ని సాయిబాబానగర్ ప్లే గ్రౌండ్‌గా పేరు మార్చాలన్నారు. వాటితో పాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని ఉపకమిషనర్‌ను సాయిబాబానగర్ కాలనీ వాసులు కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు డి.శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, శాలీవాహన్, సమ్మిరెడ్డి, వరుణ్‌కుమార్, సత్యనారాయణ, సుభాష్‌రావు తదితరులు ఉన్నారు.

వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ



మహా పడిపూజలో కొండల్‌రెడ్డి దంపతులు

బోడుప్పల్: అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీలో శ్రీస్వయంభు భ్రమరాంబ మల్లిఖార్జు స్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు మల్లిఖార్జున్, సిద్ధప్ప, శివశ్రీ శెట్టి, దక్ష ద్వారప్ప బాల్‌రెడ్డి రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ చైర్మన్ అమ్మసాని కొండల్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ 2004 సంవత్సరం నుంచి శివస్వామి దీక్షలు కొనసాగుతున్నాయని, ప్రతి సంవత్సరం దీక్షాదారుల సంఖ్య పెరుగుతున్నట్లు వెల్లడించారు. వారికి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజకు 600 మంది శివభక్తులు హాజరు కాగా వారికి అన్న ప్రసాద వితరణ జరిగినట్లు వెల్లడించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



వివరాలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి

మల్కాజిగిరి: పిల్లి నర్సింగరావు కాలనీ(ఆర్టీసీ కాలనీ)లో పీఎస్ఆర్ సొసైటీకి చెందిన స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో ప్రస్తుతం కాలనీ ఉన్న ప్రాంతం నిరుపయోగంగా ఉండేదని, పేద ప్రజలు గుడిసెలు వేసుకొని జీవనం సాగించారన్నారు. సీపీఎం పార్టీ వారి తరఫున పోరాటం చేసిందన్నారు. తొలుత ప్రభుత్వ స్థలంగా భావించినప్పటికీ ప్రైవేట్ స్థలం కావడంతో భూమి యజమాని యూసఫ్‌బేగంతో చర్చించడంతో పేద ప్రజలకు స్థలం ఇవ్వడానికి ఒప్పుకున్నారన్నారు. 2010 మార్చి నెలలో సొసైటీ పేరున 3 ఎకరాల 28 గుంటలు రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 42 గజాల చొప్పున సుమారు 316 మందికి సొసైటీ స్థలాన్ని కేటాయించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో అక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్నామన్నారు. పలువురు ఆ స్థలం తమదేనంటూ కోర్టుకు వెళ్లారని, ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టివేశారన్నారు. ఇప్పుడు మళ్లీ కొంత మంది స్థలం తమదే అంటూ నిర్మాణాలు చేపట్టారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కాలనీ సంఘం నాయకులు గణేష్, మంగ తదితరులు ఉన్నారు.

సరస్వతీ నిలయం..

అవస్థలమయం..

మౌలిక సౌకర్యాలు కరువైన తరగతి గదులు

- టీచర్ల కొరతతో ప్రభుత్వ బడులు సతమతం
- ఇప్పటికే పెద్దఎత్తున ప్రైవేటు స్కూళ్ల వైపు..
- ఫీజుల అధిక భారంతో అప్పులపాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- ఇప్పటికైనా స్పందించాలని వేడుకోలు



శిథిలావస్థకు చేరుకున్న ఇందిరానగర్ ఉర్దూ పాఠశాల

రామంతాపూర్: ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థుల భవిష్యత్‌కు దివిటీల వంటివి. పేద ప్రజలు తమ పిల్లలను చదివించే ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్న చూపు చూడటంతో వారికి సరైన విద్య అందడం లేదని సామాజికవేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు రూ.కోట్లు వెచ్చిస్తుండగా ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తి కూడా చూడకుండా గాలికి వదిలేస్తున్నారని పలువురు విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. రామంతాపూర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సాక్షి విజిట్ చేసినప్పుడు స్కూల్‌లో మౌలిక సౌకర్యాలు లేకపోవడం, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా సరిపోని తరగతి గదులు, టీచర్ల కొరతతో పాటు వాడుకనీరు, తాగునీటి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతూ అప్పుల పాలవుతున్నారు.



ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో స్లాబ్ వేయకుండా వదిలేసిన తరగతి గది

భవనాలు శిథిలావస్థకు..

స్థానిక ఇందిరానగర్‌లో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థలు చేరుకున్నాయి. ఒకటి నుంచి 5వ తరగతి ఉన్న ఈ పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో ఒక్కొక్క తరగతి గదిలో రెండేసి తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రామంతాపూర్ పరిధిలోని రాజేంద్రనగర్, వెంకట్‌రెడ్డినగర్, లక్ష్మీనారాయణ కాలనీ తదితర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లోనూ ఇలాంటి దుస్థితే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రగతినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేయని బోరు పంప్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల..

ఓల్డ్ రామంతాపూర్‌లోని ఈ పాఠశాల ప్రాంగణంలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు బోధించే ప్రాథమిక పాఠశాలతో పాటు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధించే ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ రెండు పాఠశాలలు కలిపి మొత్తం విద్యార్థుల సంఖ్య వెయ్యి వరకు ఉంటుంది. అయితే ఈ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో ఆటస్థలం లేక క్రీడలకు దూరమవుతున్నారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ఈ పాఠశాలలో ఒకే ఒక్క తాగునీరు సరఫరా చేస్తే పంపు ఉండటంతో ఆ నీరు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మరో తాగునీటి పంపు కనెక్షన్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సరిపోనూ తరగతి గదులు లేక..

రామంతాపూర్ ప్రగతినగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సరిపోను తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో ఉన్న బోర్ పంప్ పని చేయకపోవడంతో విద్యార్థులు వాడుక నీరు లేకపోవడంతో ఇంటి నుంచి వాటర్ బాటిల్ తెచ్చుకుంటున్నారు.



రామంతాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో షెడ్‌లో కొనసాగుతున్న తరగతులు

అదేవిధంగా స్కూల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో స్థానికులు కొంత మంది తమ వాహనాలను స్కూల్ ఆవరణలోనే పార్కింగ్ చేస్తూ పార్కింగ్ అడ్డాగా మార్చేశారు. దీంతో విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఆడుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. అదనపు తరగతి గదుల కోసం స్కూల్‌లో ఆనుకుని పిల్లర్లు వేసి ఉన్న దానిపై స్లాబ్ వేసి అదనపు తరగతి గది నిర్మాణం పూర్తి చేయాలని, అదేవిధంగా బోరు పంప్‌నకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని, ప్రహరీ కూడా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాడిన వంట నూనె సేకరిస్తున్న ముఠా అరెస్టు

అల్వాల్: పెద్ద హోటల్‌లో వాడిన వంట నూనెను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ముఠాను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌కు చెందిన జయకుమార్(30), జనార్దన్(32) మహారాష్ట్రవాసి సత్యతో కలిసి నగరంలోని ప్రముఖ హోటళ్ల నుంచి వాడిన వంట నూనెను సేకరించి మచ్చబొల్లారంలోని తోట పెంటారెడ్డి గార్డెన్ సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకొని నిల్వ చేస్తూ గురుగావ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీకి సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రాత్రి దాడి చేసి వాడిన నూనె నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజిగిరిలో శానిటేషన్‌ను మెరుగుపర్చండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మేకల సునీత యాదవ్

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్‌లో పలు ప్రాంతాల్లో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని శానిటేషన్ సిబ్బందిని పెంచి శానిటేషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ గలమెత్తారు. గౌతంనగర్ డివిజన్‌తో పాటు మల్కాజిగిరి సర్కిల్‌లో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని తెలిపారు. సిబ్బందిని పెంచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరినట్లు సునీత యాదవ్ తెలిపారు.

శ్రీసాయినగర్ కాలనీలో ఖడ్గపూజ



బోడుప్పల్: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్‌లోని శ్రీసాయినగర్ కాలనీలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఖడ్గపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ జాతి రక్షణకు శివాజీ నడుం బిగించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా స్పెషల్ ఇన్వైట్ సిలివేరు శంకర్, మేడ్చల్ రూరల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గొల్లపూడి విజయ, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, జైకిషన్, సురేష్, పురుషోత్తం, దివాకర్, నవీన్ పాల్గొన్నారు.

కెమికల్ వాటర్ వదులుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



బోడుప్పల్: బోడుప్పల్ రా చెరువులోకి కెమికల్ వాటర్ వదులుతున్న ఇండస్ట్రియల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రా చెరువు పైభాగంలో ఉన్న మొండి కత్వను ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ యజమానులు 10 అడుగుల పైపులైన్లు వేసి వాటి ద్వారా కెమికల్ వాటర్‌ను రా చెరువులోకి వదులుతున్నట్లు వెల్లడించారు. ఇదే విషయమై మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. కెమికల్ వాటర్ వదులుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పడతం లోకేష్ పాల్గొన్నారు.

థీమ్ పార్క్ పనుల్లో వేగం పెంచాలి



థీమ్‌పార్క్ అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: థీమ్ పార్క్ పనుల్లో వేగం పెంచాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ థీమ్ పార్క్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక హంగులతో ఆహ్లాదకరంగా థీమ్ పార్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలోనే మల్లాపూర్ డివిజన్ వాసులకు పార్కు అందరికీ అందుబాటులోకి వస్తుందన్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు అశ్విని, స్థానిక నేతలు పీఆర్ ప్రవీణ్, ఎస్వీ శ్రీనివాస్, బుసాని రఘు, శ్రీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని కలిసిన ధన్‌పాల్‌రెడ్డి



కుషాయిగూడ: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని చర్లపల్లి మాజీ కార్పొరేటర్, ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ధన్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సార వినోద్ ముదిరాజ్, పడమటి మల్లారెడ్డి, రాకేష్, ఉపేందర్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దాలి

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ బండబావిలో నిర్మించ తలపెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణం అంశాన్ని కార్పొరేటర్ ప్రభుదాస్ మంగళవారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే అన్ని రకాల అనుమతులు, ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, పనులు త్వరగా చేపట్టి ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దాలని ఆయన కౌన్సిల్‌లో కోరారు.

బీఆర్ఎస్ హయంలోనే అభివృద్ధి

మల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో మల్లాపూర్ డివిజన్ ఎంతగానో అభివృద్ధి చెందిందని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తా, వైకుంఠధామం, భవానీనగర్ నుంచి న్యూభవానీనగర్ వరకు నాలా, బ్రహ్మపురి కాలనీలో వర్షపు నీరు నిల్వకుండా సాఫీగా వెళ్లేందుకు నాలా, సీసీ రోడ్లు వంటి పలు అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు.

దేశంలో మూడోసారి బీజేపీదే అధికారం

కీసర: దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు అన్నారు. కీసర ఓఆర్ఆర్ సమీపంలోని ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఫాంహౌజ్‌లో 25వ తేదీన మేడ్చల్ నియోజకవర్గంలో ప్రారంభంకానున్న విజయ సంకల్ప రథయాత్ర విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై బీజేపీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈసారి రాష్ట్రంలో 10 పార్లమెంట్ సీట్లు బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. ఇక మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ను సైతం బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. ఇందుకోసం బీజేపీ నేతలంతా పార్లమెంట్ ఎన్నికలు అయ్యేంత వరకు పట్టుదలతో పార్టీ కోసం పనిచేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, నేతలు అమరమోహన్ రెడ్డి, వి జయేందర్, రాగుల అశోక్, దేశం మల్లేష్‌గౌడ్, కొలిచెలిమి కృష్ణ, బాపిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



రామంతాపూర్: బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్‌రావు మంగళవారం గోఖలేనగర్ మహంకాళి దేవాలయం పరిసర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి అధికారులను పిలిపించి ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించి తాగునీటి సరఫరాలో ప్రెషర్ పెంచి ఎక్కువ సమయం సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, దయానంద్‌రెడ్డి, తిరుపతయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం జరగాలి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు

కుషాయిగూడ: కేసుల సత్వర పరిష్కారం కోసం వచ్చేనెల 9న నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం జరగాలని మేడ్చల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బీఆర్.మధుసూదన్‌రావు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో మంగళవారం కుషాయిగూడలోని జిల్లా కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు, మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి, పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా చూడాలన్నారు.

మేధావులు రాజకీయాల్లోకి రావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ..

రామంతాపూర్: స్థానిక ఆంగ్ల రచయిత కనిగిరి ప్రసాద్ రచించిన ఏన్యూ పాలిటిక్స్ ఎతోస్ అనే ఆంగ్ల పుస్తకాన్ని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత, బీజేపీ సీనియర్ నేత మల్కా కొమురయ్య మంగళవారం ప్రగతినగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు రాజకీయాల్లోకి వచ్చి సమాజానికి మంచి చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పుస్తకాన్ని రచించిన రచయిత ప్రసాద్‌ను ఆయన అభినందించారు. బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే మల్కాజిగిరి నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర మహిళా నేత బండి పద్మ, కేంద్ర సెన్సార్ బోర్డు మెంబర్ ముత్తినేని జగదీష్, గాదె సత్యనారాయణ, మల్కా నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గోవా సీఎంను కలిసిన ఎన్వీఎస్ఎస్



కుషాయిగూడ: విజయసంకల్ప యాత్రలో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను మంగళవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ భువనగిరిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి రాష్ట్రంలో బీజేపీ పటిష్టతపై చర్చించారు. కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీజేపీ నాయకులు కొమ్ము నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, అప్పి నాయి పాల్గొన్నారు.

చౌదరిగూడ అభివృద్ధిపై సమీక్ష సమావేశం



ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సాంబశివరావు(ఆర్డీఏ), ఇతర అధికారులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేని కట్టడాలు, నాలా కబ్జా, మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై చర్చించారు. గ్రామంలో పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, ఏఈలు వెంకట్‌రెడ్డి, పరమేశ్, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, నర్సింగ్‌ముదిరాజ్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: విధుల నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ చట్టపరంగా చేయాల్సిన పనులు చేయడం లేదని మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విష్ణుపై మేడ్చల్‌కు చెందిన జి.మహేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీసీ కాపీల కోసం టీయాప్ ద్వారా ఈ నెల 13న దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో ఆయన చుట్టూ తిరుగుతున్నా సీసీ కాపీలు ఇవ్వడం లేదని, అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అభినందనలు



ఉప్పల్: రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన అనిల్ యాదవ్‌ను ఉప్పల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత జెట్ట అజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పూలబోకేను అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనిల్ యాదవ్‌ను కలిసిన వారిలో ఏవీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



అల్వాల్ వెంకటేశ్వర పార్కులో వైద్య పరీక్షలు

అల్వాల్: అల్వాల్ సీనియర్ సిటిజన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో అల్వాల్ వెంకటేశ్వర పార్కు (పోలీస్ స్టేషన్ ఎదురుగా) వృద్ధులకు 55 సంవత్సరాల పైబడిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు సౌందర్యషన్, జి.సుదర్శన్‌రావు, కేశవరావు, శ్రీనివాస్, రామచంద్ర పాల్గొన్నారు.

మౌలాలి డివిజన్‌కు నిధులు కేటాయించాలి



మౌలాలి: డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ వినతి పత్రం అందజేశారు. మౌలాలి డివిజన్‌ను అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని కమిషనర్‌తో పేర్కొన్నారు. డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తయ్యేలా చూడాలని కమిషనర్‌ను కార్పొరేటర్ కోరారు.